# ది లాంగెస్ట్ డే

కళ్లు తెరవగానే చురుక్కున తగిలిన సూర్య కిరణాల తాకిడికి చటుక్కున లేచి కూర్చుని టేబులుమీద ఉన్న గడియారంవైపు దృష్టి సారించింది రాధిక. ఒక్క నిమిషం తక్కువ ఏడు చూపిస్తూంది గంట.

'అమ్మయ్యో!' అప్రయత్నంగా గుండెమీద చెయ్యి వేసుకుంటూ మంచం దిగి వంటింటి వైపు నడవబోయింది. రెపరెపలాడుతూ తాను టెర్లిన్ చీరనన్న సంగతి గుర్తుచేసింది ఆమె ధరించిన చీర. లేతగులాబి రంగులో మృధువుగా మెత్తగా మెరిసిపోయే ఆ చీరతో వంటింట్లోకి వెళ్లి పనిచెయ్యడమే? సుతరామూ మనస్కరించలేదామెకు. వెంటనే గదిలోకి వెళ్ళి చీర మార్చుకునివచ్చి వంటింట్లోకి చొరబడింది.

ఆత్రంగా అగ్గిపుల్ల గీసి స్టౌ వెలిగించింది. కాని అది సరిగ్గా అంటుకుంటేగా! అనుమానం తగిలి కదిలించిచూస్తే కిరోసిన్ లేనట్టు తేలింది. 'ఇదీ ఇప్పుడే ఖాళీగా ఉండాలీ!' అని విసుక్కుంటూ లేచి కిరసనాయిలుసీసా తెచ్చి స్టౌలో పోసి మళ్ళీ వెలిగించి ఎలాగయితేనేం నీళ్లు పడేసింది రాధిక కాఫీకి.

"అమ్మగారూ, అంట్లు పడేస్తారూ?" హిందిలో మొత్తుకుంది అప్పుడే వేంచేసిన పనిమనిషి.

తాడిప్రమాణాన కోపం వచ్చింది, అసలే విసుగ్గా ఉన్న రాధికకు.

"ఏం మహాతల్లీ? ఇప్పటికీ నీకు తెల్లవారిందా? టై మెంతయిందో తెలుసా?" వచ్చీరాని భాషనే మరీ ఫోర్స్‌గా ఉపయోగించింది.

అవతలి పార్టీ ఏమాత్రం తక్కువతిన్నట్లులేదు. "ఇది బావుందమ్మోవ్! గంట కిందటనగా వచ్చి పదిసార్లు పిలిచినా పలక్కుంటే వేరే ఇంట్లో పని చేసుకువద్దామని పోయినా. నా తప్పేం ఉందంటా అందులో?" హెచ్చు స్థాయిలోనే జవాబిచ్చి పనికి ఉపక్రమించింది పనిమనిషి.

అంతలో నీరు మరిగిపోతూ ఉంటుందన్న విషయం గుర్తుకురాగానే వంటింట్లోకి పరుగు తీసింది రాధిక. నీళ్ళు సలసలా మరిగిపోతున్నాయి. తొందర్లో దింపబోగా చెయ్యి చురుక్కుమంది.

"వెధవ స్టీలు గిన్నెల కిదేం రోగమో! ఇట్టే వేడెక్కిపోతాయి!" స్వగతంలా పైకే తిట్టింది రాధిక వేలు నోట్లో పెట్టుకుంటూ.

"ఏం రాధా, కాఫీ రెడియా?" టవల్‌తో మొహం తుడుచుకుంటూ వచ్చి అడిగాడు మాధవ్.

"అరే, ఎప్పుడు లేచారు? అప్పుడే మొహంకూడా కడిగేసుకున్నారా? నే నింకా డికాషన్ వెయ్యలేదు. ఎంతసేపులెండి, టెన్ మినిట్స్!" గబగబా అంటూ కాఫీపొడి డబ్బా అందుకుని బిగుసుకుపోయిన మూత ఎట్లాగో పుస్తెలసాయంతో తెరిచింది రాధిక.

ఏముందా డబ్బాలో? ఖాళీ! చిటికడన్నా లేదు కాఫీపొడి! తెల్ల మొహంవేసుకుని నిలబడింది రాధిక.

"ఈ పూటకి కూడా లేదా?" అనుమానంగా అడిగాడు.

"ఉహూ ఉన్నదంతా వేసి చేశాను నిన్న సాయంత్రం!"

నిద్రలేచీ లేవగానే పెట్రోలు పడందే ముందుకు అడుగుపడని మాధవ్ ఆరోజు ఇంకా కాఫీ తాగకపోవడంతో అసలే కోపం రేగుతూందేమో ఏనాడూ విసుక్కోనిది భార్యను విసుక్కున్నాడు, అదీ గట్టిగా.

"ఏం? ఒకరోజుముందే తెప్పించి ఉంచుకోవాలని తెలీదూ? ఇంట్లో వస్తువయిపోయిందన్న సంగతి ఎలా మరిచిపోతావు?"

ఆ గద్దింపుతో ఉక్రోషం ముంచుకువచ్చింది రాధికకు. "మరుపన్నది మనిషికి సహజం. అసలు రాగానే సినిమాకు అంటూ కంగారుపెట్టింది మీరు! లేకపోతే జ్ఞాపకం ఉండేది నాకు. అయినా కాఫీపొడి తెచ్చి పది రోజులయింది. అయిపోయి ఉంటుందన్న ఊహ కాస్తయినా వచ్చిందా"?

మాధవ్‌కి చాలా కోపం వచ్చేసింది ఈ ఎదురుసవాలుతో. అందుకే ఎవరిని అంటున్నాడో మరిచిపోయి అనేశాడు. "సరే! ఇంటాబయటా అన్నీ నేనే చూసుకుంటే నవ్వెందుకు ఇక?"

ఆ మాటల్లో వ్యంగ్యం సూటిగా నాటుకుంది రాధిక గుండెల్లో! "అంటే? వంటమనిషి కావాలని చేసుకున్నారన్నమాట పెళ్ళి?" గ్రరున కళ్ళలో నీరు తిరుగుతూండగా, రోషంగా ప్రశ్నించింది.

"అబ్బే! అలా ఎందుకనుకుంటానూ? నాకు తెలీదూ తమరు బి.ఎ. పాసయ్యారని? స్వతంత్రంగా సంపాదించుకుని బ్రతకగలరని? వంటమనిషిగా వచ్చేకర్మ తమకేం?" వ్యంగ్యం స్ఫుటంగా గోచరిస్తున్న ముఖకవళికలతో అంటూ తువ్వాలు భుజం మీద వేసుకుని గదిలోకి విసురుగా వెళ్ళిపోయాడు మాధవ్.

టంగ టంగ్‌మంటూ ఎనిమిది గంటలు కొట్టింది గోడ గడియారం. స్టౌ మీద ఉంచిన పాలు పొంగి స్టౌ ఆరిపోయింది. తెరిచిఉన్న గిన్నెలో మరిగి చల్లారిపోయిన నీళ్ళు రాధికను చూసి జాలిగా నిట్టూర్చాయి.

'వెధవ కొంప! ఒక కాఫీపొడి కావాలంటే రెండు మైళ్ళు పరిగెట్టందే దొరకదు కదా? పక్కింట్లో అడిగి తెచ్చుకుని ప్రస్తుతం గడుపుదామంటే ఒక్కరి కన్నా కాఫీ అలవాటు లేదాయె! అంతా ఛాయ్‌మీద పడి చచ్చేవాళ్లే!" గొణుక్కుంటూ, గడిచిపోతున్న గంటను చూసి తిట్టుకుంటూ మళ్ళీ స్టౌ వెలిగించి వంటకు ఉపక్రమించింది రాధిక.

బొగ్గు వెయ్యందే ఇంజను నడవనట్టు, పెట్రోలు పోయందే కారు కదలనట్లు కాఫీ పడందే పనిచెయ్యనని సమ్మెచేసే శరీరం సహకరించడం లేదు! పాపం, రాధిక!

కూరగాయలు తరుగుతూండగా చివుక్కున తెగింది వేలు. "అబ్బ!" అంటూ చూసుకుంది. అదేపనిగా పైకి వచ్చేస్తూంది రక్తం. లోతుగా తెగిందేమో మంట పెడుతుంది.

"నా పెన్నెక్కడ తగలబడింది? అబ్బబ్బ! ఒక్క వస్తువు సరైనచోట్లో ఉండదు కదా? ఇది ఇల్లు కానేకాదు! అడవికొంప! ఛ ఛ!" హాల్లో నుండి గట్టిగా గొంతెత్తి విసుక్కుంటున్నాడు మాధవ్.

అతడికి, పాపం టైము గడుస్తున్నకొద్దీ తేలు విషం పైకెక్కేట్టు తలనెప్పి ఎక్కువతూంది కాఫీలేనిమూలాన.

అసలే బాధపడుతున్న రాధికకు పట్టలేనంత చిరాకు పుట్టుకువచ్చింది. "కొంపకేమయింది? లక్షణంగానే ఉంది. బాగాలేనిదల్లా మనుషులే! అన్నిటికి ఇతరులమీద ఆధారపడి వాళ్ళని హైరాన పెట్టడంతప్ప ఒక్కటైనా స్వంతంగా చేసుకొనే అలవాటుంటే కదా పెన్ను కనబడ్డానికి." వంటింట్లోంచే స్వరం పెంచి సమాధాన మిచ్చింది.

పాపం రాధిక! రోజూ ఆయనగారి గుండీల దగ్గిరనించి పెట్టి, పెన్నూ, కళ్ళద్దాలూ మరిచి పోకండని అందించి, తలదువ్వి గోముచేసే రాధికే ఇవాళ ఇలా అంటూంటే అనదూ మరి?

ఆ సమాధానానికి మాధవ్‌కి అరికాలు మంట నెత్తికెక్కింది. 'మాటలు నేర్చిన కుక్క ఇస్కోమంటే ఇస్కో మందిట! అయినా ఈ ఆడవాళ్ళు నాలుగక్షరాలు నేర్చుకోగానే ఏం నేర్చుకున్నా, నేర్చుకోకపోయినా ఎదురు జవాబులు చెప్పటం మట్టుకు నేర్చుకుంటారు.

మాటలతోబాటు ఎగిరెగిరి పడుతున్న పుస్తకాలు, వస్తువుల చప్పుళ్ళు వినబడు తున్నాయి రాధికకు.

"ఇక్కడెవరూ కుక్కలూ, నక్కలూ లేరు! ఊరికే మాటలు మిగలకండి!" ఉక్రోషంతో అదురుతున్న పెదవులతో అంటూ విసురుగా వెళ్ళి చారుగిన్నె దింపింది రాధిక. ఆ విసురుకు కాస్త చారు ఒలికి కిందపడి రాధిక సుకుమారమైన తెల్లని పాదాలను గాఢంగా ముద్దుపెట్టుకుంది. గిన్నె కిందపెట్టి కెవ్వుమంది రాధిక.

"ఏం? ఏమయింది?" కేకవిని లోపలికి వచ్చిన మాధవ్ పూర్తి గిన్నె కాలిమీద ఒలికిపోలేదని చూసి, "చిన్న గిన్నె దింపడంకూడా రాదు! వంటేమన్నా అయిందా? నా కివాళ భోజనప్రాప్తికూడా లేదా? తొమ్మిదిన్నర కావస్తూంది!" అన్నాడు.

రాధికకు నిజంగా దుఃఖం ముంచుకువచ్చింది, 'ఎంత పట్టించుకోనట్టు మాట్లాడుతున్నారు!" అనుకుంటే. ఒక వైపు తలనొప్పితో పగిలిపోతూంది. కోపం తారాస్థాయినందుకోగానే మౌనం అవరించిందామెను. కాలు మంటపెడుతున్నా అలాగే లేచి గబగబా కంచంపెట్టి వడ్డించింది.

తినీ తిననట్టు రెండు ముద్దలు కూరతో తిని, "పప్పు!" అన్నాడు మాధవ్, పప్పు ఉడకబెట్టడానికి టైములేదని వండలేదు." అంటూ చారు పోసింది రాధిక.

కోపంగా కలుపుకుని ఒక ముద్ద తీసి నోటిలో పెట్టుకున్నాడతను అంతే, మొహం మూడు వంకర్లు తిరిగింది.

"ఏమిటిది?" హేళనగా అడిగాడు. కడుపులో కామయ్య గంతులేస్తుంటే మరి అలాటి మాటలే వస్తాయి ఎవరికైనా.

"చారు!" పుల్ల విరిచినట్లు, పెడసరంగా అంది రాధిక. ఆవిడకు తెగిన వేలు మంట పెడుతూంది. కాలు చిమచిమ లాడుతూంది. తలనొప్పి బ్రహ్మాండంగా ఉంది. నరసమైన సమాధానమివ్వాలంటే ఎలా మరి?

"అదే! నువ్వు చేసిన వంట పేరేమిటో నువ్వు చెబితేగానీ తెలీదులే!" అంటూ చటుక్కున కంచంలో చెయ్యి కడుక్కుని చివుక్కున లేచి వెళ్ళిపోయాడు మాధవ్.

మరో పదినిమిషాల్లో వీధి తలుపు దభాలున వేలుసుకుని మాధవ్ వెళ్లిపోగానే వంటింట్లోంచి వెలుపలికి వచ్చింది రాధిక.

ఇల్లంతా అస్తవ్యస్తంగా ఉంది. నడుస్తుంటే తల అదిరిపోతూంది నొప్పితో, మందు ఉందేమోనని అలమార్లో వెదికింది. ఉహూ! అవసరానికి ఏదీ ఉండదు. నీరసంగా మంచంమీద వాలింది వెళ్ళి.

అన్నంకూడా తినలేదేమో మరీ ఇదిగా ఉంది. అందులో పొద్దుటినుండీ అన్నీ మనసుకు నొప్పి కలిగించే సంఘటనలే వరసగా జరిగాయి.

'సమయం వస్తేనే ఈ మగవాళ్ళ బుద్ధులు బయటపడతాయి. చదువుకున్న భార్యంటే తనకెంతో గర్వంగా ఉందనే ఆయనగారి నిజస్వభావం ఇవ్వాళ కదా తెలిసింది! ఆదర్శాలు, ఆశయాలు అంటూ ఉపన్యాసం దంచే ఆయన హృదయం ఎంత సంకుచితమో ఒక్క మాటలో తేలిపోయింది. ఇల్లు చూసుకునే మనిషి కావాలని వీళ్ళంతా పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారన్నమాట! ప్రేమలూ, మురిపాలు అంతా కల్లబొల్లి నాటకాలే!'

ఒక్కోటి తలుచుకుని తనివితీరా కళ్ళ నీళ్ళు కార్చేశాక కాస్త మనసు తేలికపడి నట్టయింది రాధికకు. అంతలోనే ఒంటిగంట కావస్తూండడం చూసి లేచివచ్చి అన్నం పెట్టుకుని కూర్చుంది. చల్లగా చల్లారిపోయిన అన్నంలా రుచిహీనంగా అనిపించింది కూర. కాస్త తిని చారు పోసుకుని ముద్ద నోట పెట్టుకుంది. 'ఏమిటి ఇలా ఉంది?' అనుకుని రాధిక మరి తినలేకపోయింది. అసలందులో ఉప్పు అనబడే పదార్థం వెయ్యడం మరిచిపోయింది. చటుక్కున మాధవ్ అన్నం తినక చెయ్యి కడుక్కుని పోవడం గుర్తుకు వచ్చింది రాధికకు.

మసనంతా పాడైపోగా ఇక తిన బుద్ధికాక లేచేసింది. త్వరత్వరగా వంటిల్లు, హాలు శుభ్రంచేసేసి, చీర మార్చుకుని బజారుకు బయలుదేరింది. తిరిగి ఆవిడ కాఫీపొడి పొట్లంతో ఇంటికి వచ్చేసరికి మూడయింది గంట.

త్వరత్వరగా స్టౌ వెలిగించి కాఫీ తయారుచేసింది. మూడు కప్పులు ఫ్లాస్క్‌లో పోసి తనో కప్పు వేడిగా తాగగానే ప్రాణం లేచివచ్చినట్టనిపించింది రాధికకు. ఆ ఉత్సాహంతో మాధవ్ కిష్టమైన పొటాటో చిప్స్ టిఫిన్ తయారుచేసింది. అన్నంకూడా వండి ఆదరువు చేసేసరికి మాధవ్ వచ్చే టైమయింది.

ఆదరాబాదరా మొహం కడుక్కుని మంచి చీర కట్టుకుని ముస్తాబు ముగించింది రాధిక.

ఇంట్లో ఎటువంటి దృశ్యం ఎదురవుతుందో ననుకుంటూ విరక్తిగా లోపలికి అడుగుపెట్టిన మాధవ్ ఇల్లంతా అద్దంలా నీటుగా ఉండడం చూసి తెల్లబోయాడు.

"వచ్చారా? కాళ్ళు కడుక్కురండి!" అంటూ వంటింట్లోకి వెళ్ళిన రాధిక ప్రసన్నవదనం, ఆమె సింగారం చూసి విస్తుపోయాడు. కిమ్మనకుండా వెళ్ళి కాళ్ళు కడుక్కువచ్చి పడక కుర్చీలో వాలాడు.

"పాపం దొరగారు అలిసిపోయారు!" ప్లేట్‌లో టిఫిన్, కప్పులో పొగలుగక్కే కాఫీతో వచ్చిన రాధిక వాటిని టీపాయ్‌మీద పెట్టి అతనికి దగ్గిరగా జరిపింది. అంతకుముందే ఆఫీసులో పెట్రోలు పడడంవలన మాధవ్ ఇంజను మంచి ధోరణిలోనే ఉంది.

"వెరీ నైస్! నా ఫేవరిట్ టిఫిన్ చేశావే? థ్యాంక్యు వెరీ మచ్, డార్లింగ్!" రాధిక బుగ్గమీద చిన్నగా చిటికెవేసి అవి ఖాళీచెయ్యనారంభించాడు.

"నా వంటకూడా పూర్తయిపోయింది!" అతని ముందు కూర్చుని తనూ కాఫీ తాగుతూ చిరునవ్వుతో అంది రాధిక.

"రియల్లీ! ఎంతయినా ఈ చురుకుపల్లెటూరి మొహాల కెక్కడవస్తుంది?"

ప్రశంసాపూర్వకంగా రాధిక భుజం తట్టాడు మాధవ్. అంతలో చటుక్కున గుర్తుకు వచ్చిందతిడికి.

"అరే, మరిచేపోయాను, రాధా! జాజిపూలు తెచ్చాను" అంటూ జేబులో నుండి పొట్లం తీశాడు. చేతులు చాస్తున్న రాధిక కివ్వకుండా తానే పొట్లం విప్పి స్వయంగా రాధిక సిగలో అలంకరించాడు.

"వాట్ ఎ బ్యూటిపుల్ గర్ల్ యు ఆర్!" ఆశ్చర్యంగా అన్నాడు ఆమెను చూస్తూ.

"వాటీజ్‌ది నెక్స్ట్ ప్రోగ్రామ్?" గారంగా గోముగా అడిగింది రాధిక.

"యువర్ విల్ అండ్ విష్, మేడమ్! ఆయామ్ ఆల్వేస్ ఎట్ యువర్ సర్వీస్!" ఇంగ్లీషు పద్ధతిలో తలను వంచుతూ అతి వినయంగా అన్నాడు మాధవ్.

"ఇవ్వాళ పున్నమి! అలా షికారు పోదాం! ఏం?" ఉత్సాహంతో మెరుస్తున్న కళ్ళతో సూచన చేసింది రాధిక.

"ఆల్‌రైట్!" వెంటనే ఒప్పేసుకుని బట్టలు మార్చుకోవడానికి గదిలోకి వెళ్ళాడు మాధవ్. హుషారుగా ఇంటికి బీగంవేసి షికారుకు బయలుదేరారు రాధా మాధవులు.

ఏకాంతంగా ఉన్న ప్రదేశంలో లాన్స్‌మీద చతికిలబడ్డారు ఇద్దరూ నడిచినడిచి అలిసిపోయి.

వెండికిరణాలు వెదజల్లుతూ ప్రశాంతమైన నీలాకాశంలో తెలిమబ్బులచాటున తారకలతో దోబూచులాడుతూ పరుగులిడుతున్న సుధాకిరణుణ్ణి తదేకంగా చూస్తూ తన్మయంగా అంది రాధిక!

"తుషారశీతల సరోవరాన అనంత నీరవనిశీధిలో ఏ కలువకన్నె నిరీక్షిస్తుందనో ఈ పరుగు?"

"అతడేమో తన భామను చేరడానికి పోతున్నాడు గానీ నాపక్కనున్న కలువభామ నన్ను మరిచిపోయి ప్రకృతి అందాలతో పరవశించిపోతూంది."

చిలిపిగా అన్నాడు మాధవ్.

"ఊహు! పాపం!" బుంగమొహంతో అంటూ నవ్వింది రాధిక. అంతలో చటుక్కున అడిగింది.

"అన్నట్టు నిన్న పిక్చర్ బావుంది కదండి! నాకేమో చాలా నచ్చింది! మీకో?"

"నాకూ నచ్చింది. బావుంది కానీ, రాధీ కోపం తెచ్చుకోనంటే ఓ మాట." కొంటెగా చూస్తూ ఆగిపోయాడు.

"ఏమిటో అది?" ప్రశ్నార్థకంగా చూసింది రాధిక.

"పిక్చర్ మాటకేంగానీ ఆ పేరు ఈవేళ మన ఫార్స్‌కి సరిపోతుంది కదూ? టుడే ఈజ్ ది లాంగెస్ట్ డే ఉయ్ ఎవ్వర్ హాడ్! అవునా?" అల్లరిగా అంటున్న మాధవ్ మాటలలో నిజాన్ని ఒప్పుకుంటున్నట్టుగా కిలకిలా నవ్వేసింది రాధిక.

ఈ నవ్వుల అర్థం తెలియక బెదిరిపోయి మబ్బుచాటున దాకున్నాడు జాబిలి.

**ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక**

తేది : 19-4-1967